సరిహద్దులో పారిశ్రామిక పొద్దు!

- రూ.544 కోట్లతో ఇథనాల్ ఇంధన తయారీ ప్రాజెక్టు ఏర్పాటుకు కసరత్తు
- మరో ఎల్ఈడీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు విప్ కాపుతో చర్చలు
- నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు


ఇన్వెస్టర్లకు అభినందనలు తెలుపుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి (ఫైల్)

రాయదుర్గం: కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం నియోజకవర్గంలో పారిశ్రామిక పొద్దు పొడుస్తోంది. డి హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో ఇప్పటికే పలు ఐరన్ ఓర్, స్పాంజ్ ఐరన్, పైపుల తయారీ లాంటి పరిశ్రమలు నెలకొల్పారు. ఈ కారణంగా వేలాది మంది నిరుద్యోగులకు జీవనోపాధి లభిస్తోంది. తాజాగా డి హీరేహాళ్ మండలం జాజర కల్లు వద్ద రూ.544 కోట్ల వ్యయంతో ఇథనాల్ ఇంధన తయారీ కొత్త పరిశ్రమ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా భూమిపూజ చేశారు. దీంతో కంపెనీ ప్రతినిధులు పరిశ్రమ నెలకొల్పే పనుల్లో నిమగ్నమయ్యారు. ఐదారు నెలల్లోనే పరిశ్రమలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేలా కసరత్తు మొదలు పెట్టారు. సోమవారం ఫ్యాక్టరీ ఏర్పాటయ్యే స్థలాన్ని ఇంజినీరింగ్ బృందంతో కలసి ఇన్వెస్టర్లు పరిశీలించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతోనే ఇది సాధ్యమైందని ఇన్వెస్టర్లు పేర్కొన్నారు. ఈ కారణంగా ప్రత్యక్షంగా 500 మంది, పరోక్షంగా 1000 మందికి జీవనోపాధి లభిస్తుందని వారు వివరించారు.

ఎల్ఈడీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు

డి హీరేహాళ్ ప్రాంతంలోనే మరో ఎల్ఈడీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు చర్చలు జరిపేందుకు ముందుకొస్తున్నారని విప్ కాపు తెలిపారు. వారికి కావాల్సిన స్థల సేకరణ పూర్తయితే రాష్ట్ర ప్రభుత్వం తరఫున మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు రాయదుర్గం అనువుగా ఉందని, ఎంత మంది ముందుకొచ్చినా తమ వంత కృషి చేస్తామని విప్ వివరించారు. నిరుద్యోగ వ్యవస్థ పూర్తిగా రూపుమాపాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకంతోనే ఏపీలో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు తరలివస్తున్నారన్నారు.

రైతులకు ప్రయోజనం

ఇథనాల్ ఇంధన తయారీ పరిశ్రమ ఏర్పాటైతే రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ తదితర ప్రాంతాల్లో పండించే మొక్కజొన్న, బియ్యం నూకలకు మంచి డిమాండ్ ఏర్పడుతుంది. దళారీ వ్యవస్థ రూపుమాపడంతో పాటు రైతుకు మద్దతు ధర లభించనుంది. వర్షాలకు ధాన్యం తడిచినా రైతులకు ఇబ్బంది ఉండదు. ఆ బియ్యంను కూడా ఫ్యాక్టరీలో కొనుగోలు చేస్తారు.

ఇన్వెస్టర్లకు అభినందనలు

డి హీరేహాళ్ మండలం జాజరకల్లు వద్ద భారీ పరిశ్రమ నెలకొల్పేందుకు ముందుకొచ్చిన ఇన్వెస్టర్లకు విప్ కాపు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వారికి రాయదుర్గంలో సన్మానం నిర్వహిస్తామన్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహిస్తే మరింత మంది పెట్టుబడిదారులు ముందుకొచ్చే అవకాశం ఉందన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీలు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ ఎస్‌కే ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వీరన్న, వైస్ హెచ్ఎం బాషా, పీడీలు అష్రాఫ్‌హుసేన్, రాజేష్ తెలిపారు. వారు మాట్లాడుతూ అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలో ఈనెల 7న నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14, -17 విభాగాల బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు ఎస్.మెహమూద్, నవకిరణ్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. నవంబర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు ఎస్సీ కాలనీలో ఉపాధి నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచు బీవ్లారాణి ఆధ్వర్యంలో ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం పరుగులు పెడతోందని సర్పంచు అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ కన్వీనర్ నాగరాజు, పీఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వీరేష్, సచివాలయ ఇంజనీర్లు రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి చేయూత


విద్యార్థినికి సహాయం చేస్తున్న ఉపాధ్యాయుడు

శెట్టూరు: తండ్రిని కోల్పోయిన విద్యార్థినికి ఓ ఉపాధ్యాయుడు అండగా నిలిచాడు. మండలంలోని మాకోడికి గ్రామానికి చెందిన గంగాధర్, మారెక్క దంపతులకు నలుగురు పిల్లలు అందులో ముగ్గురు అమ్మాయిలు. నాలుగేళ్ల క్రితం గంగాధర అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆర్థిక పరిస్థిల కారణంగా పిల్లల చదువులు ఆగిపోయాయి. బాగా చదువుతున్న మల్లేశ్వరి చదువు ఆగిపోవడంతో తల్లి మారెక్క తల్లడిల్లిపోయింది. దీంతో అదే గ్రామంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బద్దేనాయక్‌ను వారు ఆశ్రయించారు. అందుకు స్పందించిన ఆయన మల్లేశ్వరి నర్స్ కోర్సు పూర్తయ్యే వరకూ ఆర్థికసాయం చేస్తానని అండగా నిలిచాడు. సోమవారం వారి కుటుంబానికి రూ.32 వేల నగదు అందజేశారు. తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు బద్దేనాయక్‌ను అభినందించారు.

సేవాభావం అలవర్చుకోవాలి



స్వచ్ఛత కార్యక్రమంలో ప్రిన్సిపాల్, విద్యార్థులు

కళ్యాణదుర్గం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి అన్నారు. స్థానిక కళాశాలలో సోమవారం మహాత్మాగాంధీ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ కే శ్రీధర్, ఎంటీ జ్యోత్స్న విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 11కు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా సోమవారం తెలిపారు. అధికారులు, సర్పంచులు, జెడ్పీటీసీ,ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ జగన్నాథ్

కళ్యాణదుర్గం: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథ్ సూచించారు. కేంద్ర యువజన మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జాతీయ సేవా పథకం నేతృత్వంలో గాంధీ జయంతి వారోత్సవాల్లో భాగంగా సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులతో కలిసి ప్రిన్సిపాల్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయలక్ష్మి, బాషూజీ, ఓబిలేసు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని మారెంపల్లి కాలనీలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళ తిమ్మక్కను సెబ్ పోలీసులు అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. ఆమె నుంచి 18 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పాత కేసులో పరారీలో ఉన్న నిందితులు పూజారి మురళి, కావలి అన్నూర్‌స్వామిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ కృష్ణానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్యాయత్నం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని టీటీపీ లేఅవుట్‌లో ఓ వ్యక్తి కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. పురపాలక సంఘంలోని పారిశుధ్య విభాగంలో రెగ్యులర్ స్వీపర్‌గా పనిచేస్తున్న తిప్పేస్వామి(37) ఇంట్లోనే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఘటన జరిగిన వెంటనే అతడిని బంధువులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు అనంతపురానికి సిఫార్సు చేశారు. బంధువుల నుంచి ఫిర్యాదు అందకపోవడంతో తిప్పేస్వామి ఆత్మహత్యాయత్నానికి స్పష్టమైన కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. అప్పులబాధతోపాటు కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉండొచ్చని తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పశు వైద్య శిబిరాలకు స్పందన


రాయదుర్గం: పశువులకు చికిత్స చేస్తున్న దృశ్యం


కూడేరు: మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

రాయదుర్గం రూరల్: మండలంలోని డి.కొండాపురంలో వాటర్ షెడ్ సౌజన్యంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ జి.వెంకటేష్ తెలిపారు. వాటర్ షెడ్ కాంపోనెంట్ ప్రధానమంత్రి కృషిసంచాయి యోజన 2.0 పథకం కింద 28 పశువులకు చూలు పరీక్షలు చేయగా, 10 పశువులు చూలు కట్టినట్లు గుర్తించామన్నారు.18 పశువులు గొడ్డుమోతు సమస్యతో బాధపడుతున్నట్లు నిర్ధారించామన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు ఎ.శిరీష, రమేష్, వాటర్ షెడ్ పీఓ శ్రీవిద్య, టెక్నికల్ అధికారులు ఈరన్న, విశ్వేశ్వర, వాటర్ షెడ్ చైర్మన్ అంజనేయులు, పశుసంవర్ధక సహాయకులు, గోపాల మిత్రలు, ప్రయోగశాల సిబ్బంది పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని కలగ్ళలో సోమవారం ప్రధానమంత్రి కృషి సంచాయీ యోజన పథకం కింద వాటర్ షెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని విశేష స్పందన లభించింది. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహణాధికారి(డీఎల్‌డీఏ ఈఓ) డాక్టర్ సుధాకర్ పశువులకు వైద్య సేవలు అందించారు. వాటర్ షెడ్ టీఓ విశ్వనాథ్‌రెడ్డి, చైర్మన్ భాస్కర్ రెడ్డి, మండల పశువైద్యాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.


విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సులో పాల్గొన్న మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బాల్య వివాహాలతో అనర్థాలు


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ వనజ అక్కమ్మ

శెట్టూరు: బాల్య వివాహాలతో అనర్థాలు చోటుచేసుకుంటాయని కంబదూరు ప్రాజెక్టు సీడీపీఓ వనజ అక్కమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శ్రీధర్, ఎస్ఐ యువరాజుతో కలిసి బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసేవారికి శిక్ష తప్పదన్నారు. మండలంలో బాల్య వివాహాల నిరోధక, పర్యవేక్షణ కమిటీలను నియమిస్తామన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం అయ్యగార్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాలు 1, 2ను సీడీపీఓ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులు, ఆన్‌లైన్ వివరాలు పరిశీలించారు. ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహార కిట్ల పంపిణీ, కేంద్రాలకు హాజరవుతున్న పిల్లలు గర్భిణులు, బాలింతల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఫిరోజ్‌ఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో నాణ్యమైన వైద్యం


మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రమ్మ

ఉరవకొండ: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో వచ్చిందని ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ అన్నారు. సోమవారం మండలంలోని వెలిగొండ గ్రామంలో జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ వీరాంజనేయులుతో కలసి వారు ప్రారంభించారు. శిబిరంలో 220 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణులకు ఖరీదైన వైద్య సేవలు అందించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కణేకల్లు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని సొల్లాపురం సర్పంచు మహేశ్వరి అన్నారు. మండలంలోని సొల్లాపురంలో సోమవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ గూడెన్న, డాక్టర్లు చంద్రమనోహర్, విజయకుమార్‌నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సోమలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కళ్యాణదుర్గం: మండలంలోని పాలవాయి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ హాజరుకానున్నారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజలు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని మంత్రి కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

గుమ్మఘట్ట: మండలంలోని రంగసముద్రం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి సోమవారం తెలిపారు. గ్రామస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డయల్ యువర్ డీఎంకు ఐదు ఫిర్యాదులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం ఆర్టీసీ డిపోలో సోమవారం సాయంత్రం జరిగిన డయల్ యువర్ డీఎంకు ప్రయాణికుల నుంచి ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు డిపో మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల దాకా డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఫోన్ ద్వారా ప్రయాణికుల నుంచి వచ్చిన వినతులు నమోదు చేసుకుని పరిష్కారం కోసం ఆర్ఎంకు దృష్టికి తీసుకెళ్తానన్నారు. రాయదుర్గం నుంచి చెళ్లికెర మీదుగా బెంగళూరుకు, గొడిశలపల్లి మీదుగా బళ్లారికి, మొలకాల్మూరుకు, చిత్రదుర్గానికి బస్సులు నడపాలని విన్నవించారు. అలాగే రాయదుర్గం మండలం మల్లాపురం, మెచ్చిరి మీదుగా బళ్లారికి, ఎల్‌బీ నగర్ నుంచి ఉద్దేహాళ్‌కు వేళకు బడి బస్సు రావడం లేదని ఫిర్యాదు చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


పాల్తూరు బీసీ కాలనీలో రక్త నమూనాలు సేకరిస్తున్న ఏఎన్ఎం, ఆశా వర్కర్లు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు బీసీ కాలనీలో వైద్యాధికారులు సీజనల్ వ్యాధులపై సోమవారం అవగాహన కల్పించారు. కాలనీలో తొమ్మిదేళ్ల చిన్నారి డెంగీతో మృత్యువాత పడటంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచు బీవ్లారాణి సమక్షంలో డాక్టర్ అరుణకుమారి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బత్తుల కోదండరామిరెడ్డి, ఈఓఆర్డీ సత్యబాబు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ ఏఎన్ఎం శ్రావణి, ఆశా వర్కర్లు బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో వైద్యం శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే కాలనీలో పారిశుధ్యం మెరుగుపరిచారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దాసరి లక్ష్మీదేవి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు సెల్ఫీలతో 'కాలవ' రాజకీయం

రాయదుర్గంటౌన్: ఐదేళ్లు మంత్రిగా ఉండి చేతగానితనంతో అవినీతి ముసుగులో రాయదుర్గం అభివృద్ధిని విస్మరించిన కాలవ శ్రీనివాసులు అబద్ధపు సెల్ఫీలతో సిగ్గులేని రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే నియోజకవర్గంలో 40 ఏళ్ల అభివృద్ధిని చేసి చూపిన ఘనత ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి దక్కుతుందన్నారు. ఇదంతా కాలవ చూసి ఓర్వలేక పిచ్చిపట్టి సెల్ఫీలతో కాలం వెళ్లదీస్తున్నట్లు విమర్శించారు. కాపు రామచంద్రారెడ్డి వేయించిన రోడ్లను తాను వేయించినట్లు సోమవారం కాలవ శ్రీనివాసులు పెట్టిన సెల్ఫీపై మాధవరెడ్డి స్పందించారు. అబద్ధాల సెల్ఫీలతో ప్రజలను మోసం చేయలేరని, ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలకు తెలుసన్నారు. కాలవ శ్రీనివాసులు తన చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకు సెల్ఫీలతో నీచ రాజకీయాలకు పాల్పడుతుండడం సిగ్గుచేటన్నారు. అవినీతిలో కూరుకుపోయిన టీడీపీ శకం ముగిసిందన్నారు. టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలే కాలవను నమ్మేస్థితిలో లేరనే విషయాన్ని తెలుసుకుంటే మంచిదని ఆయన హితవు పలికారు.

'ఇళ్ల స్థలాలు రద్దు చేయొద్దు'

విడపనకల్లు: మండల కేంద్రంలో 2018లో నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేయకూడదని లబ్ధిదారులు తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సర్వేనంబర్ల 503సీ, 502సీలో 400 మందికి ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టాల రద్దు ప్రక్రియను వెనక్కి తీసుకోకపోతే తీవ్ర ఆందోళన చేస్తామని రెవెన్యూ అధికారులను వారు హెచ్చరించారు. తహసీల్దారు ఈరమ్మ స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లి లబ్ధిదారులు అందరికీ న్యాయం చేస్తామన్నారు. దీంతో లబ్ధిదారులు శాంతించారు.

అభివృద్ధి సూచికలు సిద్ధం చేయాలి

బ్రహ్మసముద్రం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2022- 2023లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి సూచికలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ దాసానాయక్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి సూచికలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బరాయుడు, ఏఓ నందకిశోర్, వ్యవసాయ అధికారి సరిత, వెలుగు ఏపీఎం నీలామణి, ఎంఈఓ క్రిష్ణానాయక్, ఉపాధి ఈసీ జయప్రకాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామసభ

కుందుర్పి: మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 2023-24 సంవత్సరానికి ఉపాధి హామీ పనుల గుర్తింపుపై సోమవారం కుందుర్పి,జంబుగుంపల తదితర గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించి ప్రణాళికలు తయారు చేశారు. ఉపాధి పథకం కింద మెట్టభూముల్లో పండ్లతోటల పెంపకం, మట్టి కట్టల నిర్మాణం, నీటి కుంటల తవ్వకాలు, ఫారంపాండ్ల ఏర్పాటు తదితర పనులను గుర్తించి జిల్లా అధికారులకు నివేదిస్తామని ఎంపీడీఓ వెంకటనాయుడు, ఏపీఓ వరంధామ తదితరులు తెలిపారు. కార్యక్రమంలో కుందుర్పి, జంబుగుంపల సర్పంచులు మారుతేశ్వరి, గంగాధర, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గైర్హాజరయ్యే అధికారులపై ఫిర్యాదు

కూడేరు: స్పందన కార్యక్రమానికి గైర్హాజరయ్యే అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కాగా కార్యక్రమానికి ఏపీఎం రాజశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కాంతమ్మ మాత్రమే హాజరయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశాలున్నాయన్నారు.కానీ పలు శాఖల అధికారులు హాజరు కావడంలేదన్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలి

రాయదుర్గంటౌన్: రైల్వే శాఖను ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయం విరమించుకోవాలని, రైల్వేలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఏఐవైఎఫ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొట్రేష్ రాయదుర్గంలోని రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మాస్టర్ హేమంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కరోనా సమయంలో రద్దు చేసి కొన్ని రైళ్లను పునరుద్ధరించలేదన్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యను పెంచాలన్నారు. రైల్వేలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు వివేక్, తేజ, దినకర్, రవి తదితరులు పాల్గొన్నారు.